సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 26 । జూన్ । 2024



పీసీబీ తనిఖీలు
తంగడపల్లి గ్రామ శివారులోని ఐఎన్ ఆగ్రోవిట్ పరిశ్రమలో పీసీబీ, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. - 10లో



యాదాద్రిలో సీఎస్ పూజలు
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి మంగళవారం యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. - 10లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభ్యంతరాల స్వీకరణ పూర్తి

భువనగిరి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ మంగళవారం ముగిసింది. ఈ నెల 24న ఎస్‌ఏల బదిలీలు ముగియగా అదే రోజు ఎస్‌జీటీల పదోన్నతులకు సంబంధించి సీని యార్టీ జాబితాను ప్రకటించారు. ఈమేరకు అభ్యంతరాలు స్వీకరించారు. కాగా.. జిల్లాలో మొత్తం 1227 మంది ఎస్‌జీటీలు పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని కేటగిరిలకు సంబంధించి 503 స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమాన స్థాయి పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఈ నెల 26న వెబ్ ఆప్షన్ పెట్టుకునే అవకాశం ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష

భువనగిరిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై మంగళవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓలు పాల్గొన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూపొందించిన కార్యాచరణను కలెక్టర్ వివరించారు.

నేడు పోచంపల్లికి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, నకిలీ చేనేత ఉత్పత్తులు అరికట్టడం, వస్త్ర వ్యాపార అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు బుధవారం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జయరావు, ఏడీఓ ఎండీ ఫకీల్, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్ పోచంపల్లి సందర్శించనున్నట్లు పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని టై అండ్ డై అసోసియేషన్ రజతోత్సవ భవనంలో చేనేత కార్మికులు, కళాకారులు, దుకాణదారులు, వ్యాపారులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

ఫైర్ స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైల నియామకం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట అగ్నిమాపక కేంద్రానికి ఇద్దరు ఎస్సైలను నియమించినట్లు అడిషనల్ జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్ మంగళవారం తెలిపారు. దేవరకొండలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ హమీద్, నూతనంగా రిక్రూట్ అయిన మధుసూదన్‌రెడ్డి యాదగిరిగుట్ట అగ్నిమాపక కేంద్రానికి నియామకమైనట్లు పేర్కొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ




ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యా ణం, బ్రహ్మోత్సవం జరిపించారు. సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

దారికాచి.. దోపిడీ

జాతీయ రహదారిపై పెరిగిన దోపిడీలు, దొంగతనాలు



- రాత్రి వేళ రెచ్చిపోతున్న దొంగలు
- హైవేపై కొరవడిన పోలీస్ నిఘా..
- హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆగాలంటే జంకుతున్న వాహనదారులు
- భారీగా నమోదవుతున్న కేసులు, పట్టుకున్నది తక్కువే..

ఈనెల 22వ తేదీన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పాండ్రేగుపల్లికి చెందిన కాట్రాల ఉపేందర్, తన స్నేహితుడు బాబాతో కలిసి హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని స్వాతి దాబా వద్ద ఆగి రొట్టెలు తిన్నారు. నిద్ర రావడంతో కారులోనే పడుకున్నారు. అర్ధరాత్రి 2.40 గంటల ప్రాంతంలో నిద్ర లేచారు. అంతకుముందే కారు డ్యాష్ బోర్డులో పెట్టిన రూ.2.21 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్కూటీపై వచ్చిన దుండగుడు నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

ఈనెల 9వ తేదీన తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పల్లెపు శృతి ఆమె అన్న పంచాక్షరి, వదిన అఖిల, వారి కుమారుడు దేవాన్ష్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అర్ధరాత్రి కావటంతో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని ట్రక్ బేలో కారు ఆపి నిద్రిస్తున్నారు. తెలవారు జామున ఇద్దరు దుండగులు వచ్చి కారుపై రాళ్లతో దాడి చేశారు. అనంతరం వారిని కారులోనుంచి బయటికి దింపి వారి ఒంటిపై ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. **జాతీయ రహదారి వెంట జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలకు ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే.**

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దోపిడీ, దొంగతనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట రౌడీ ముఠాలు, దొంగలు రెచ్చిపోతున్నారు. హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున దోపిడీలు జరుగుతున్నాయి. నిత్యం రద్దీ ఉండే ఈ రహదారిపై వాహనదారులు రాత్రి వేళల్లో తమ వాహనాలను రోడ్డు వెంట ఆపుకొని నిద్రకు ఉపక్రమిస్తుంటారు. ఆ సమయంలో దొంగలు దోపిడీలకు పాల్పడుతున్నారు. అంతేకాదు రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లే వారిని కూడా టార్గెట్ చేసి దోచుకుంటున్నా.. పట్టించుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెట్ల చాటున మాటువేసి..

ఏడాది కిందట తిప్పర్తి మండలానికి చెందిన భార్యభర్తలిద్దరు బైక్‌పై నల్లగొండ నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ సమయంలో నార్కట్‌పల్లి - అద్దంకి జాతీయ రహదారిలో నల్లగొండ సమీపంలోని లెప్రసీ కాలనీ వద్ద మూత్ర విసర్జన కోసం భార్య చెట్ల చాటుకు వెళ్లింది. అదే సమయంలో చెట్ల చాటున ఉన్న దోపిడీ ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులు ఆ మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దోచుకున్నారు. భర్త ముందే భార్యపై దాడి చేస్తుండగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు పిల్లలు గట్టిగా అరిచారు. భర్త ముఠా సభ్యులను ఎదిరించగా అతడిపై దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కెళ్లారు.



నార్కట్‌పల్లిలో ఓ హోటల్ వద్ద రూ.28 లక్షలు చోరీ జరిగింది ఈ బస్సులోనే.. (ఫైల్)

ఏడాది కావస్తున్నా దొరకని దొంగలు

గత ఏడాది జూలై 26వ తేదీన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలార్‌దేవర్‌పల్లిలోని కృష్ణాపురం కాలనీ చెందిన సుశాంత్‌కుమార్ పొందా తనకు రావలసిన వ్యాపార డబ్బులు వసూలు చేసుకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తిరిగి వెళ్తున్నాడు. నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లి సమీపంలోని పూజిత హోటల్ వద్ద రాత్రి 8 గంటలకు ప్రయాణికులకు టిఫిన్ కోసం బస్సు ఆపగా బాధితుడు బస్సు దిగి వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బస్సులోని రూ.28 లక్షలు పెట్టిన బ్యాగులను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసినా ఇంతవరకు దొంగలను పట్టుకోలేకపోయారు.



పెద్దకాపర్తి సమీపంలో దాడి చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అప్పటి ఎస్పీ చందనాదీప్తి (ఫైల్)

ఐదు నెలల్లో జరిగినవి 279.. పట్టుకున్నది 46 కేసులు

నల్లగొండ జిల్లాలో దోపిడీలు, దొంగతనాలను పెద్ద ఎత్తున జరుగుతున్నా పోలీసులు మాత్రం దొంగలను పట్టుకోలేకపోతున్నారు. గడిచిన ఐదు నెలల్లో 279 దొంగతనం కేసులు నమోదయ్యాయి. అందులో ఇప్పటివరకు పోలీసులు 46 కేసుల్లో మాత్రమే నిందితులను పట్టుకుని సొత్తు రికవరీ చేశారు. జనవరిలో 53 కేసులు నమోదు కాగా, 11 కేసుల్లో, ఫిబ్రవరిలో 54 కేసులకు 10 కేసుల్లో, మార్చిలో 69 కేసులకు 22 కేసుల్లో, ఏప్రిల్‌లో 29 కేసులకు ఒక్క కేసులో, మే నెలలో 74 కేసులకు గాను రెండు కేసుల్లోనే నిందితులను పట్టుకొని సొత్తు రికవరీ చేశారు.

రోడ్డు పక్కన నిద్రించేవారిపై దాడులు, దోపిడీ

ఏడాది కింద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిలో లెప్రసీ కాలనీ వద్ద హైదరాబాద్ వెళుతున్న డీసీఎం డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి నిద్రపోయాడు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు, శేషమ్మగూడానికి చెందిన బాలుడితో కలిసి కారులో వచ్చి డీసీఎం డ్రైవర్‌ను కొట్టారు. నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. మర్రిగూడ బైపాస్‌లో ఇదే తరహాలో మరో లారీ డ్రైవర్‌ను కొట్టి రూ.25 వేలు దోచుకెళ్లారు. పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో నిందితులను పట్టుకున్నారు.

- చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామ శివారులోని జీఎంఆర్ టోల్‌ప్లాజా వద్ద మే నెల మొదటి వారంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో నిద్ర రావడంతో టోల్‌ప్లాజా వద్ద కారు ఆపుకొని అందులోనే నిద్రించారు. ఆ సమయంలో అటుగా వచ్చిన దొంగలు కారులో పెట్టిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు.
- దండుమల్కాపురం సమీపంలోని బొర్రోళ్లగూడెం వద్ద ఏడాది కిందట హైదరాబాద్ నుంచి వెళ్తుండగా, నిద్ర రావడంతో లారీ డ్రైవర్ లారీని పక్కన బస్‌షెల్టర్ వద్ద నిలిపాడు. డ్రైవర్ నిద్రిస్తున్న సమయంలో వచ్చిన దొంగలు లారీ కేబిన్‌లో దాచిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు.

వాహనదారుల భయాందోళన

జిల్లాలోని రహదారులపై దోపిడీ దొంగల ఆగడాలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్ల వెంట ఆగడమే కాదు, ప్రయాణించాలంటేనే వణుకుతున్నారు. ఆగిఉండే వాహనాల్లో డీజిల్‌తోపాటు సెల్‌ఫోన్లు, డబ్బు, బంగారం దోచుకుంటున్నారు. అయితే దోపిడీలకు పాల్పడుతున్నది ఉమ్మడి జిల్లాకు చెందిన వారు కాదని, దొంగతనాల్లో ఆరితేరిన ఇతర ప్రాంతాలకు చెందిన వారని పోలీసులు చెబుతున్నారు. కొన్నిసార్లు సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో దొంతనాలు జరుగుతుండటంతో పట్టుకోవడంలో దుండగులను ఆలస్యమవుతోందని చెబుతున్నారు.

రోడ్డు పక్కన హత్య

హైదరాబాద్‌లో ఇంటిసామాను దింపి తిరిగి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పామర్రు మండలం చెట్లవారిపురం గ్రామానికి వెళ్తున్న కొల్లూరి రాజవర్ధన్ అనే డీసీఎం డ్రైవర్ మే 18వ తేదీన కట్టంగూర్ మండలంలోని ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద డీసీఎం ఆపుకొని నిద్రిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు అతని కాళ్లను కట్టేసి, గొంతు నులిమి దారుణంగా హత్య చేశారు. రోడ్డుకు అవతలివైపున పడేశారు. ఇంతవరకు నిందితులను పట్టుకోలేదు.

‘విశ్వకర్మ’ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: చేతివృత్తులు, హస్త కళాకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో విశ్వకర్మ పథకం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ పథకానికి సంబంధించి ఇప్పటివరకు 7,627 దరఖాస్తులు వచ్చాయని, వీటిని గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిల్లో పరిశీలించి 3,771 దరఖాస్తులు జిల్లా స్థాయికి పంపించారని తెలిపారు. వీటిలో 2,059 దరఖాస్తులను గతంలో రాష్ట్ర స్థాయికి పంపామని, మిగిలిన 1,712 దరఖాస్తులను పంపించేందుకు జిల్లా కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటివరకు 1,059 దరఖాస్తులకు ఆమోదం తెలపగా అందులో 559 మందికి 7 రోజుల శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డుతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, టూల్ కిట్స్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ చేసుకునేందుకు మద్దతు లభిస్తుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, సహాయ సంచాలకులు సుమతి, లీడ్ బ్యాంక్ అధికారి శివ రామకృష్ణ, బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, లక్ష్మీనారాయణగౌడ్, మొగులయ్య, నరేందర్ పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రాజాపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న రైతు భరోసా, రుణమాఫీ పథకాల అమలుపై రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు నేస్తం ద్వారా ప్రభుత్వ పథకాల అమలుపై రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ఈమేరకు రైతుల అభిప్రాయాలను వినతి పత్రాల ద్వారా స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, ఎంపీటీసీ దాచపల్లి రాజు, ఆత్మ చైర్మన్ మేక వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ దినకర్, జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ, ఉద్యానవన అధికారి సైదులు, డీఏఓ పద్మావతి, ఏఓ మాధవి పాల్గొన్నారు.

సేంద్రియ సాగు పరిశీలన

రాజాపేట: సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రానికి చెందిన రైతు ఠాకూర్ స్వరణ్‌పాల్ సింగ్ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి సాగు విధానాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ పద్మావతి ఉన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ సాగు విధానాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు



భువనగిరిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

భువనగిరి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక వినాయక చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అంతకు ముందు పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు పోతంశెట్టి రవీందర్, నర్ల నర్సింగ్‌రావు, పడమటి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివకుమార్, అశోక్‌గౌడ్, రత్నపురం బలరాం, ఫక్కీర్ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మాధురి, వైజయంతి, కృష్ణ, శ్రీశైలం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని గిరిజన బాలికల వసతి గృహం పక్కన నిల్వ ఉన్న మురుగు నీరు



భువనగిరిలోని సర్దార్ కాలనీలో ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- వ్యాధుల నివారణపై నిర్వహించని అవగాహన కార్యక్రమాలు
- అమలుకు నోచుకోని ఫ్రైడే డ్రైడే

భువనగిరి: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రధానంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాల కారణంగా వీధులు, రహదారులు, ఇళ్ల నడుమ మురుగు నీరు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇదివరకు 300 నుంచి 400 వరకు ఓపీ నమోదు అవుతుండగా.. ప్రస్తుతం 400 నుంచి 500 వరకు ఓపీ కేసులు నమోదవుతున్నాయి. జ్వరం, వాంతులు, విరోచనాల బారిన పడిన వారే ఎక్కువగా వస్తున్నారు. కాగా.. పారిశుద్ధ్యంపై అధికారులు ముందస్తు చర్యలు కూడా తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

కనిపించని పారిశుద్ధ్య చర్యలు..

జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. పాలక వర్గాలతో పాటు అధికారులు సైతం పారిశుద్ధ్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఆయా ప్రాంతాల్లో మురుగు నీరు, డ్రెయినేజీ కాల్వల్లో మట్టి పేరుకుపోతోంది. నివాసాల మధ్యే చెత్త నిల్వలు ఉంటున్నాయి. ఇదిలా ఉండగా.. ఆదివారం 10 గంటలకు 10 నిమిషాలు, ఫ్రైడే డ్రైడే ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. అండర్ డ్రెయినేజీ నిర్మాణాలు సరిగా లేక మురుగు నీరు నివాసాల మధ్యనే ప్రవహిస్తోంది. దీంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. పిచ్చి మొక్కలు భారీఎత్తున పెరుగుతున్నాయి. వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టడం లేదు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలను వైద్యాధికారులు నిర్వహించడం లేదు.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం



భువనగిరి పట్టణంలోని సర్దార్ కాలనీలో డ్రెయినేజీ నిర్మాణాలు లేవు. మురుగు నీరు నివాసాల మధ్య నుంచే ప్రవహిస్తోంది. గుంతల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలకు నిలయంగా మారుతున్నాయి. రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

– గీత, గృహిణి,, భువనగిరి

అధికారులను అప్రమత్తం చేశాం



వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో పాటు, ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులతో సమన్వయంతో పనిచేసే విధంగా అప్రమత్తం చేశాం. లీకేజీలను నివారించడం, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, నీటి గుంతలు పూడ్చటం, డ్రెయినేజీ సమస్యలు లేకుండా చేయాలని ఆదేశాలిచ్చాం. రోగ నిర్ధారణకు కావాల్సిన కిట్లు అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ పాపారావు, డీఎంహెచ్ఓ

నమోదవుతున్న కేసులు ఇలా..

జిల్లాలో ఇప్పటికే అధికారికంగా నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా చాలా కేసులు ఉన్నట్లు సమాచారం. గతేడాది అధికారికంగా 26 కేసులు నమోదు కాగా అనధికారికంగా వందకు పైగా కేసులు నమోదయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే డెంగీ కేసులతో పాటు మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రజలను కలవరపెడుతున్నాయి. గత సంవత్సరం 762 టైఫాయిడ్ కేసులు నమోదు కాగా 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 356 కేసులు నమోదయ్యాయి.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- రాచకొండ సీపీ తరుణ్‌జోషి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీపీ తరుణ్‌జోషి, ఎయిమ్స్ వైద్యులు, విద్యార్థులు

బీబీనగర్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రాచకొండ సీపీ తరుణ్‌జోషి అన్నారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎయిమ్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వాడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ వల్ల జరిగే పరిణామాలు, చట్టాలను అమలు చేసే సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమాజ సహకారం గురించి వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు, ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ బాటియా మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఎయిమ్స్‌లో అత్యాధునిక డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్ నారంగ్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ జగదీష్ చందర్‌అరోరా, సైకియాట్రీ విభాగం ఇన్‌చార్జ్ సాయికృష్ణ టిక్కా, డిప్యూటీ డైరెక్టర్ వర్గీస్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ శ్యామల లైయర్, డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

నూతనకల్: ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మహిళ మెడలో గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెలతాడు చోరీ చేశారు. ఈ ఘటన నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన కొండ్ర శోభ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి ఇంటి వరండాలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని సుమారు 3.50గ్రాముల పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. ఆ సమయంలో ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారు నిద్రలేచేసరికి దొంగలు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ పరిశీలించి బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన దొంగలు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ఇందిరానగర్‌లో మంగళవారం మహిళా మెడలో గుర్తుతెలియని వ్యక్తి బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. వివరాలు.. ఇందిరానగర్‌కు చెందిన కేసర బోయిన లక్ష్మమ్మ ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి వచ్చి ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కోని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరస్వామి తెలిపారు.

లారీల్లోని డీజిల్ అపహరణ

నూతనకల్: పెట్రోల్ బంక్‌ల్లో ఆపి ఉన్న లారీల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి డీజిల్ దొంగిలించారు. ఎస్ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం బంక్, చినవెమిల క్రాస్ రోడ్డులోని నయారా బంక్ వద్ద లారీ డ్రైవర్లు విశ్రాంతి కోసం లారీలను ఆపి నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి డీజిల్ ట్యాంక్‌లను పగులగొట్టి డీజిల్ దింగిలించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఘటనా స్థలాలను తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ పరిశీలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

- ప్రభుత్వం స్పందించాలని జూనియర్ డాక్టర్ల డిమాండ్

నల్లగొండ టౌన్: ప్రభుత్వ జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజూ కొనసాగింది. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట జూనియర్ డాక్టర్లు నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అత్యవసర సేవలు మినహాయించి ఓపీ, వార్డు డ్యూటీలను బహిష్కరించారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డా. అబ్దుల్ సమద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎస్ఎల్‌బీసీలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభించాలని, మెడికల్ కాలేజీలో, ప్రభుత్వ ఆస్పత్రిలో తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. అత్యవసర సేవలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, డాక్టర్ల రక్షణకు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని, పీజీ విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం కల్పించాలని కోరారు. డ్యూటీ డాక్టర్లకు నాణ్యమైన భోజనం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాజువాలిటీ అత్యవసర సేవల విభాగాల్లో ఏసీలు ఏర్పాటు చేయాలన్నారు. స్టయిఫండ్ నెలనెలా ఇచ్చేలా బడ్జెట్ కేటాయించాలన్నారు.



నల్లగొండ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ తీస్తున్న జూనియర్ డాక్టర్లు

నూతన హాస్టళ్లు నిర్మించాలి..

సూర్యాపేట: సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. నూతన మెడికల్ కళాశాలలకు నూతన హాస్టళ్లు నిర్మించాలని, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గౌరవ వేతనం కల్పించాలన్నారు. ఈ సమ్మెలో జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీఎన్ ప్రదీప్, ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జి. చాందినిరెడ్డి, డాక్టర్ పృథ్వీ కల్యాణ్, జనరల్ సెక్రటరీలు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఆయేషా, డాక్టర్ షేక్ షాహబాజ్, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు



స్టైఫండ్ నెలనెలా ఇవ్వాలి


జూనియర్ డాక్టర్లకు నెలనెలా స్టైఫండ్ అందించడానికి ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాలి. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తాం.

– డాక్టర్ సమద్, నల్లగొండ

మందులు అందుబాటులో ఉంచాలి


అత్యవసర సేవలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి. మందులు లేని కారణంగా రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించలేకపోతున్నాం.

– డాక్టర్ అఖిల, నల్లగొండ

తాగునీటి వసతి కల్పించాలి


మెడికల్ కాలేజీతో పాటు వసతి గృహాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సరైన తాగునీటి వసతులను కల్పించాలి. పీజీ మహిళా డాక్టర్లకు ప్రత్యేక డ్యూటీ గదులను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ వర్షిణి, నల్లగొండ

వసతి గృహాలు ఏర్పాటు చేయాలి


పీజీ డాక్టర్లకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రిలో మహిళా డాక్టర్లకు ప్రత్యేక వసతులతో పాటు వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలి. సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ శ్వేత, నల్లగొండ

డిమాండ్లను నెరవేర్చాలి


ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్, రెసిడెంట్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. డిమాండ్లన్నింటిని నెరవేర్చేంత వరకు సమ్మె విరమించం.

– డాక్టర్ రమాదేవి, నల్లగొండ

ప్రభుత్వం స్పందించాలి


గత ప్రభుత్వానికి సైతం పలుమార్లు మా సమస్యలను విన్నవించాం. అయినా మా సమస్యలు పరిష్కరించలేదు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలి.

– డాక్టర్ పృథ్వీ కళ్యాణ్, జూడా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సూర్యాపేట

స్టైఫండ్ రాక ఇబ్బందులు


నెలనెలా స్టైఫండ్ రాక ఇబ్బందులు పడుతున్నాం. నెలల తరబడిగా స్టైఫండ్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. రోగులకు సేవలందిస్తున్న మాకు సకాలంలో స్టైఫండ్ ఇస్తే బాగుంటుంది.

– డాక్టర్ అజయ్, జూడా సంఘం జనరల్ సెక్రటరీ, సూర్యాపేట

అత్యవసర సేవలు కొనసాగిస్తున్నాం


ప్రభుత్వం స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. తగిన ఫలితం ఉంటే మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించగలుగుతాం. అత్యవసర సేవల విషయంలో ఇబ్బందులు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం.

– డాక్టర్ ధరణి, సూర్యాపేట

భారీగా గంజాయి పట్టివేత..?

చౌటుప్పల్: మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నట్లు సమాచారం. ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక సివిల్ పోలీసులు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇన్నోవా కారులో భారీగా గంజాయి బస్తాలు లభ్యమైనట్లు తెలిసింది. ఇన్నోవా కారు ముందు స్విఫ్ట్ కారు ఎస్కార్ట్‌గా వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని వాహనాల్లోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి సుమారుగా 280–300 కిలోల వరకు ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 12 మందిపై కేసు నమోదు

మోత్కూరు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిపై కేసు నమోదు చేశారు. వివరాలు.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ సమీపంలోని అన్నెపు మురళి ఇంటి వద్ద మంగళవారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.27040, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు..?

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ మెయిన్ బజార్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో వ్యక్తిని గోతిలో పూడ్చిపెట్టిన నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ నెల 22వ తేదీన రాత్రి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రహమాన్, పెయింటర్‌గా పనిచేస్తున్న శివసాయిరెడ్డి ఘర్షణ పడ్డారు. 23వ తేదీ ఉదయం షాపింగ్ కాంప్లెక్స్‌లో రక్తపు మరకలు కనబడటంతో పాటు రహమాన్, శివసాయిరెడ్డి అదృశ్యమవ్వడంతో కాంప్లెక్స్ యజమాని పెద్దబాబు పోలీసులకు సమాచారం అందించాడు. సోమవారం షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో పూడ్చిపెట్టిన రహమాన్ మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. విచారణను వేగవంతం చేసిన పోలీసులు శివసాయిరెడ్డిని హుజూరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమహేంద్రవరానికి చెందినవాడని తెలిసింది.

సారా అమ్ముతున్న మహిళకు జరిమానా


నోటీసులు ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు

సంస్థాన్ నారాయణపురం: నాటు సారా తయారుచేసి అమ్ముతున్న సంస్థాన్ నారాయణపురం మండలం వెంకబావితండాకు చెందిన కరెంటోత్ మగ్రుకు మంగళవారం ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్, ఎస్ఐ శంకర్ నోటీసులు అందజేసి రూ.50వేల జరిమానా వసూలు చేశారు. మగ్రు గతంలోనూ నాటుసారా అమ్మడంలో బైండవర్ చేశామని, బైండవర్ ఉల్లంఘించడంతో నోటీసు అందజేసి జరిమానా వసూలు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ గెస్ట్ హౌజ్ దగ్గర ఖాళీ స్థలంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతుడి వయస్సు 55 ఏళ్లు ఉంటుందని, రైల్వే స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తుండేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు బూడిద రంగు షర్టు, నెక్కర్ ధరించి ఉన్నాడని, మృతుడి జేబులో చిల్లర డబ్బులు తప్ప ఏమీ దొరకలేదని అన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. రైల్వే ఓఆర్‌హెచ్ కేర్‌టేకర్ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యండ్లపల్లి శివారులోని చెరువులో..

సూర్యాపేట: మండలంలోని యండ్లపల్లి శివారు వెంకటాపురం చెరువులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. రూరల్ ఎస్ఐ బాలునాయక్ చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు, ఎత్తు 5 అడుగుల 4అంగుళాలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మెరూన్ రంగు షర్ట్, గులాబీ రంగు నెక్కర్ ధరించినట్లు పేర్కొన్నారు. 6రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712686030 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నాటుసారా తయారీ స్థావరంపై దాడులు


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

యాదగిరిగుట్ట (తుర్కపల్లి): తుర్కపలి మండలం శ్రీనివాసపురంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరంపై మంగళవారం ఎక్సైజ్ సీఐ దీపిక ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి సారా తయారీకి వినియోగించే 20 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. సారా తయారుచేస్తున్న వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎక్సైజ్ సీఐ వెల్లడించారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఐదేళ్లు జైలు శిక్ష

భువనగిరి క్రైం: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ భువనగిరి జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మాధవీలత మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. పోచంపల్లి మండల కేంద్రానికి చెందిన ఆలె వెంకటేష్ కుటుంబ సభ్యులతో భువనగిరి పట్టణంలోని ఆర్‌బీ నగర్‌లో నివాసం ఉండేవాడు. వెంకటేష్ వేధింపులు భరించలేక 2016 మే 17వ తేదీన అతడి భార్య శారద ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు అప్పట్లో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా.. ఈ కేసు తుది విచారణలో భాగంగా మంగళవారం సాక్ష్యాధారాలు పరిశీలించిన భువనగిరి జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ కేసు వాదించారు.

రూ.33లక్షలు మోసం చేసిన ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

- పోలీసుల అదుపులో బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు
- నిందితుల నుంచి రూ.24లక్షలు స్వాధీనం
- రూ.9లక్షలతో పరారీలో మరో నిందితుడు

నల్లగొండ క్రైం: ఇచ్చిన డబ్బుకు రెట్టింపు ఇస్తామని మోసం చేసిన బిహార్‌కు ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. వివరాలు.. నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు శ్రీరామోజు రామాచారి భూమి కొనుగోలు కోసం రూ.33 లక్షలు ఇంట్లో ఉంచాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన రామ్ నరేష్‌యాదవ్ గతంలో రామాచారి ఇల్లు కట్టాడు. ఈ పరిచయంతో నరేష్‌యాదవ్ స్నేహితుడైన అదే రాష్ట్రానికి చెందిన షేక్ శివరాజ్ కలిసి సోమవారం రామాచారి ఇంటికి వెళ్లారు. తమ వద్ద డబ్బును రెట్టింపు చేసే లిక్విడ్ ఉందని, తమకు ఎంత డబ్బు ఇస్తే అంతకు రెట్టింపు చేసి ఇస్తామని మాయమాటలు చెప్పారు. రామచారి బావమరిది అయిన బైరోజు అమరేంద్రచారి అదే సమయంలో ఇంట్లో ఉన్నాడు. అందరూ ఇంట్లోని పైఅంతస్తులోకి వెళ్లారు. రామాచారి రూ.33లక్షల నగదను వారికి చూపించగా వారి వెంట తెచ్చుకున్న లిక్విడ్‌ను ఒక బకెట్‌లో పోసి రూ.3లక్షలు(ఆరు రూ.50వేల కట్టలు) అందులో ముంచి పైకి తీసి ఆ కట్టలకు కలర్ ప్లాస్టర్ వేసి ఒక బండిల్‌గా చేశారు. అలా మరో రూ.3లక్షలు తెల్ల కాగితాలను లిక్విడ్‌లో ముంచి బండిల్‌గా మార్చేశారు. ఇలా మొత్తం రూ.33లక్షలను 11 కట్టలుగా కట్టారు. అనుమానం రాకుండా రెండు వైపులా అసలు రూ.500 నోట్లు పెట్టి మధ్యలో తెల్ల కాగితాలు ఉంచి ప్యాక్ చేశారు. ఇంతో ఒక పేషెంట్ ఆర్‌ఎంపీ రామాచారి వద్దకు వచ్చి పిలువడంతో అతడు కిందకు దిగగా.. బిహార్‌కు చెందిన ముఠా సభ్యులు వారి వెంట తెచ్చిన బ్యాగులో రూ.33లక్షలు సర్దుకున్నారు. హైదరాబాద్‌కు వెళ్లి లేబుల్స్ తెస్తామని రామాచారికి చెప్పి కలర్‌లో ముంచిన బండిల్స్‌ను వేడి చేసి ఉంచాలని చెప్పి వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన రామాచారి వారిచ్చిన బండిల్ మధ్యలో ఒక నోటు తీసి చూడటంతో తెల్ల కాగితాలుగా కనిపించడంతో మోసపోయానని గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముఠా సభ్యులు నల్లగొండ రైల్వే స్టేషన్ నుంచి బిహార్‌కు పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు రైల్వే స్టేషన్ చేరుకుని రామ్‌నరేష్‌యాదవ్, షేక్ శివరాజ్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో సభ్యుడు షేక్ అఫ్తాబ్ రూ.9లక్షలతో పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ డానియెల్, ఎస్ఐ శివకుమార్, కానిస్టేబుల్ తిరుమలేష్, జానకిరాములు, హోంగార్డు సలీం, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్ల కట్టలు, లిక్విడ్ బాటిళ్లు, సెల్‌ఫోన్లు

నకిలీ బంగారంతో గోల్డ్ లోన్.. 8 మంది అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్: నకిలీ బంగారం బ్యాంక్‌లో తనఖా పెట్టి గోల్డ్‌లోన్ తీసుకున్న 8మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన కేశవరపు రాజేష్ బంగారం పని నేర్చుకుని మిర్యాలగూడలో రాజేష్ గోల్డ్ వర్క్స్ పేరుతో దుకాణం పెట్టాడు. నష్టాలు రావడంతో అప్పులు తీర్చడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి, నెల్లూరు నుంచి నకిలీ బంగారు గొలుసులు తయారు చేయించి వాటిపై హాల్‌మార్క్, కేడీఎం 916 ముద్ర వేయించాడు. గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో పనిచేసే గోల్డ్ అప్రయిజర్ జిల్లేపల్లి నరేందర్‌తో రాజేష్‌కు గల పాత పరిచయంతో అతనితో మాట్లాడాడు. తాను తీసుకొచ్చే బంగారం నిజమైనదని ధృవీకరిస్తే.. లోన్ మంజూరయ్యాక కొంత నగదు ఇస్తాను అని చెప్పడంతో నరేందర్ ఒప్పుకున్నాడు. అప్పటి నుంచి రాజేష్ తన పేరు మీద, అతని భార్య వర్షిత, అతడి బంధువులు కొమెరపూడి వెంకటచారి, కణితి సాయిరాం, అతని స్నేహితులు అగ్రగొర్ల పరశురాములు, దోనేటి ముఖేష్, మోతుకూరి సూర్యతో పేరుతో నకిలీ బంగారం బ్యాంక్‌లో తనఖా పెట్టాడు. దానిని అప్రయిజర్ నిజమైన బంగారం అని ధ్రువీకరించడంతో బ్యాంక్ సిబ్బంది వారి అందరి పేర్ల మీద దాదాపు రూ 53.89 లక్షలు లోన్లు మంజూరు చేశారు. కొన్నాళ్లకు బ్యాంక్‌లో జరిగిన అంతర్గత తనిఖీల్లో అది నకిలీ బంగారం అని తేలడంతో బ్యాంక్ మేనేజర్ మేడబోయిన శ్రీకాంత్ గరిడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన సీఐ చరమంద రాజు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నిందితులు నేరేడుచర్ల మండలం వైకుంఠపురంలోని కేశవరపు రాజేష్ ఇంటి వద్ద ఉన్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7 సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. 8 మందిని అరెస్టుచేసి హుజూర్‌నగర్ కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


లింగయ్య (ఫైల్)

అర్వపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఎలుకల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం రాత్రి అర్వపల్లిలో జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లికి చెందిన కట్ల లింగయ్య(45) స్థానికంగా తోపుడు బండిపై టిఫిన్ సెంటర్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లింగయ్య తన ఇంటిని ఓ ఫైనాన్స్ కంపెనీలో కుదువబెట్టి లోన్ తీసుకున్నాడు. ఈ లోన్‌ను సరిగ్గా చెల్లించకపోవడం, టిఫిన్ సెంటర్ సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో సోమవారం రాత్రి ఇంట్లో ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎస్‌కే యాకూబ్ తెలిపారు.

ఈదులూరులో మరొకరు..

కట్టంగూర్: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన రాపోలు మురళి(39) స్వగ్రామంలోనే ఉంటూ నల్లగొండ పట్టణంలో కారు డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలో మంగళవారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీను(49) పని నిమిత్తం మంగళవారం తెల్లవారుజామున బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తుండగా గ్రామ సమీపంలో ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. శ్రీనుకు గాయాలు కావడంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య పెయ్యల లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీపై నుంచి పడి కార్మికుడు..

బోర్‌వెల్ లారీపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం వద్ద జరిగింది. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాకు చెందిన బోటిరాం బఘేల్(28) మిర్యాలగూడ మండలం చింతపల్లిలో నివాసముంటూ బోర్‌వెల్ లారీపై కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బోర్‌వెల్ లారీపై మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామానికి వెళ్తుండగా.. బోర్‌వెల్‌పై కూర్చున్న బోటిరాం బఘేల్ కాలుజారి రోడ్డు పక్కనే ఉన్న ఓ మొద్దుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న భువనేశ్వర్ బఘేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.